బీమా భారం

- ఉచిత వంటల బీమాను అటకెక్కించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు?
- ప్రీమియం రైతులే చెల్లించేలా ఉత్తర్వులు
- బీమా నమోదుకు ముగిసిన గడువు
- రైతులపై భారం లేకుండా ప్రీమియం చెల్లించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం



గడివేములలో ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట

గడివేముల: ఉచిత పంటల బీమా'కు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలన్న నిబంధన తెరపైకి తెచ్చింది. ఈ పరిణామం రైతుల్లో ఆవేదన నింపుతోంది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే.. ప్రభుత్వం మాత్రం తమకు ఏ మాత్రం ప్రోత్సాహం అందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి తమకు ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా చేయించేదని అన్నదాతలు గుర్తుచేసుకుంటున్నారు.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

ఖరీఫ్ సీజన్‌లో మండలంలో దాదాపు 22 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్–2025 సీజన్‌కు ప్రభుత్వం గుర్తించిన పంటలకు బీమా ప్రీమియం చెల్లింపునకు ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. కాగా ఈనెల 15తో పంటల బీమా గడువు ముగిసింది. ఇందులో భాగంగా మండలంలో పత్తి, వేరుశనగ, అరటి పంటల బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొంది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు రైతులే స్వయంగా పంటల వారీగా ప్రీమియం చెల్లించాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ పంటకూ ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే పంటల బీమా అమలు చేసింది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ) ఆధ్వర్యంలో ఎకరాకు రైతు చెల్లించాల్సిన ప్రీమియంను నిర్ణయించింది. పత్తికి రూ.1600, వేరుశనగ రూ.560 , అరటి రూ. 2,750 చొప్పున వసూలు చేశారు.

రైతులపైనే భారం..

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడింది. ఈ రబీ సీజన్ నుంచి వంట సాగుచేసే ప్రతి రైతు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. ప్రభుత్వ సాయం అందక పెట్టుబడులకు అప్పులు చేసిన రైతులు ప్రీమియం కూడా చెల్లించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయని నిట్టూర్చుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందో స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో ప్రీమియం చెల్లించడం కష్టంగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా, సమయం తక్కువగా ఉండటం, ప్రీమియం రైతులే చెల్లించాల్సి రావడంతో చాలా మంది బీమా నమోదు చేసేందుకు ముందుకు రాలేదు.

రైతులకు అండా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఈ-క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు



తుపానుకు దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

చేశారు. రైతులు సాగు చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియంను ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకున్నారు. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన ప్రతి సందర్భంలోనూ రైతులు పూర్తిగా నష్టపరిహారం అందుకునే వారు. కౌలు రైతులకు సైతం పరిహారం అందించారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాలకే జమ చేసేవారు.

నేరుగా రైతు అకౌంట్లోకే

తుపాను ప్రభావంతో ఖరీఫ్- 2021 సీజన్‌లో సాగు చేసిన దెబ్బతిన్న పంటలకు వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద రూ.2.12 కోట్లు 1438 మంది రైతుల అకౌంట్లలో జమ చేయడం జరిగింది. అదే విధంగా ఖరీఫ్- 2022 సీజన్‌లో సాగు చేసి దిగుబడి అధారంగా, దెబ్బతిన్న పంటలకు వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద రూ.2.73 కోట్లును 2,133 మంది రైతులకు పరిహారంగా అందించడం జరిగింది. అప్పట్లో వ్యవసాయ అధికారులు నిర్ధారించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం మరో ఆలోచన చేయకుండా రైతులకు అండగా నిలిచింది.

ఉచిత బీమా అమలు చేయాల్సిందే



ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే రైతులను దెబ్బతీసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత బీమాను కొనసాగించి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. వ్యవసాయం చేయడం కష్టంగా మారిన నేపథ్యంలో ప్రీమియం భారాన్ని రైతులను భరించమనడం సరికాదు. దీనిపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులపై తీవ్రమైన భారం పడుతుంది.

– బీఎస్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్, గడిగరేవుల

ప్రభుత్వమే చెల్లించాలి



ఉచిత పంటల బీమాను ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే మాలాంటి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో భారం పడుతోంది. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడిసాయం అందజేయాలి. ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలి.

– తలారి చిన్నన్న, గడివేముల

క్లుప్తంగా

వర్మీకంపోస్టు తయారు చేయాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: చెత్త సంపద (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాలలో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం చెట్లమల్లాపురం గ్రామంలో ఎంపీడీఓ పర్యటించారు. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. తడి, పొడి చెత్త వేరు వేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్. భూపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాలు



దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏడీఐపీ పథకం ద్వారా దివ్యాంగులకు పరికరాలు అందించేందుకు క్యాంపును నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి 415 మంది దివ్యాంగులు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వీరికి త్వరలోనే పరికరాలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఈఓ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రమిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. మండల నాయకులు మధు, కృష్ణ మాట్లాడుతూ కూటమి నాయకులు 2024 ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే పగలగొట్టండని చెప్పి, అధికారంలోకి వచ్చాక దగ్గరుండి బిగిస్తుందన్నారు. ఎ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శీను, గోపి, యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించువాలి



ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

కల్లూరు: టీబీ అనుమానిత లక్షణాలున్న వారందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల బృందం సూచించింది. మంగళవారం ఉలిందకొండ గ్రామ సచివాలయం-1 పరిధిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి అవగాహనపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నవీన్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ విజయ్‌కుమార్, సిబ్బంది స్వర్ణగౌరి, మద్దమ్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కల్లూరు: ఇంటిని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కె. మార్కాపురం గ్రామంలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాధి సోకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోతీలాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

సి.బెళగల్: మండల పరిధిలోని తుంగభద్ర నది తీర గ్రామాల్లో మంగళవారం డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి పర్యటించారు. ముందుగా ఆమె మండలంలోని కొండాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఎక్కడా మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తర్వాత ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల్లో పర్యటించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

పీ4 సర్వేపై గ్రామ సభలు నిర్వహించాలి

ఓర్వకల్లు : గ్రామాలలో చేపట్టిన పీ4 సర్వేలపై గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రభుత్వం, ప్రజలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో దారిద్ర్యరేఖకు దిగువన గల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలన్న ఉద్దేశంతో సర్వేల ద్వారా బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ కుటుంబాలను గ్రామ సచివాలయాలోని నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు. బంగారు కుటుంబాలలో ప్రభుత్వ మార్గదర్శకాలు, అర్హతల ఆధారంగా సదరు జాబితాలోని లోపాలు, వ్యత్యాసాలను సవరించుటకు గాను మండలంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. షెడ్యూలు ప్రకారం 15న బొడ్డువానిపల్లె, పాలకొలను, చింతలపల్లె, కన్నమడకల, లొద్దిపల్లె, 17న కేతవరం, పూడిచెర్ల, కొమరోలు, సోమయాజులపల్లె గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. 19న బ్రాహ్మణపల్లె, ఎన్ కొంతలపాడు, తిప్పాయపల్లె, గుట్టపాడు, మీదివేముల, నన్నూరు, ఉయ్యాలవాడ, ఓర్వకల్లు, శకునాల, హుసేనాపురం గ్రామాలు. 21న ఉప్పలపాడు, కాల్వ, 22న గుడుంబాయి తండా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామ సభలకు గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు హాజరుకావాలని చెప్పారు.

ఓటరుగా నమోదు చేయాలి

ఓర్వకల్లు: గ్రామాలలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో నియోజకవర్గ స్థాయి బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఎలక్షన్ డీటీ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఓర్వకల్లు, కల్లూరు తహసీల్దార్లు విద్యా సాగర్, ఆంజనేయులు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదే అన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కర్నూలు(రూరల్): స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. నగరంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న యాట శేషయ్య (50) మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కర్నూలు నుంచి తన స్వగ్రామమైన నందికొట్కూరు మండలం వడ్డెమాను గ్రామానికి వెళుతున్నాడు. ఆత్మకూరు నుంచి కర్నూలుకు వస్తున్న ఆర్టీసీ బస్సు గార్గేయపురం నగరవనం సమీపంలో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి భార్య రహేలమ్మ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తాలూకా అర్బన్ ఎస్ఐ చంద్రశేఖరు రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తూ బదిలీపై కల్లూరు మండలానికి వెళ్లిన హరికిషన్‌ను పాఠశాల హెచ్‌ఎం అనంతయ్య, తోటి ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు హరికిషన్ తన వంతుగా రూ.21వేలు విలువ చేసే మైక్ సెట్టును హైస్కూల్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




హరికిషన్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దేవీ దీవించు

కర్నూలు(రూరల్): కోరిన కోర్కెలు తీర్చే మాతల్లీ... ఎల్లమ్మ అంటూ భక్తులు వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తారు. వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుంకుమర్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.





దర్శనానికి బారులు తీరిన భక్తులు, అలంకరణలో అమ్మవారు

గుండ్రేవులో సామాజిక తనిఖీపై సభ

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ అంశాలపై డీఆర్పీ నాగరాజు మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో జరిగిన ఈ సభలో గ్రామ పంచాయతీ పరిధిలో 23 పనులను చేపట్టగా, రూ.65 లక్షల పైగా ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్లు తేలిందని డీఆర్పీ తెలిపారు. ఈసీ పృథ్వీరాజ్, పీఎస్ శామలమ్మ, టీఏ అలీఫ్‌ప్రియ ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

సి.బెళగల్: పత్తి పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సాగు చేసిన పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తి పంటలో గులాబీరంగు పురుగు నివారణకు ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా సప్పలమ్మ పండుగ



సంగాలలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని సంగాల గ్రామంలో మంగళవారం సప్పలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకు ఒకసారి గ్రామ దేవతా పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. పండుగలో భాగంగా అమ్మవారి ఆలయానికి గ్రామస్తులు ఊరేగింపుగా చేరుకొని పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు తీసుకెళ్లి సమర్పించారు.

తిమ్మందొడ్డిలో తోరణం ప్రారంభం

మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో మంగళవారం గ్రామస్తులు మారెమ్మ అమ్మవారి నూతన తోరణం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ శివారులోని నందవరం మండలం, రాయచోటు గ్రామానికి వెళ్లు దారిలో వంక దగ్గర, తుంగభద్ర నదితీరంలో వెలసిన శ్రీ మారెమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో భక్తులు తోరణం నిర్మించారు. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్తులు బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా బాటమారెమ్మ ఊరేగింపు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని పొలిమేరలో ఉన్న బాట మారెమ్మ ఊరేగింపును మంగళవారం గ్రామ సర్పంచు భాగ్యరత్న ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు బాటమారెమ్మను భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచు మాదులు, గ్రామ పెద్దలు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎద్దుల మహేశ్వరరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాటమారెమ్మకు పూజలు నిర్వహిస్తున్న సర్పంచు, గ్రామపెద్దలు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ దాడులు



గడివేములలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

పాణ్యం : మండలంలోని ఎరువులు, పెస్టిసైడ్స్ దుకాణాలో విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా కమలాపురం వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, అనంతపురం విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, ఏఓ జయప్రకాష్‌రెడ్డి తనిఖీలు చేశారు. గోడౌన్‌లలో నిల్వ ఉన్న ఎరువుల బస్తాలు, వాటి ధరలు, నిల్వల వివరాలు, ధరల వివరాలు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు తదితర వాటిపై ఆరా తీశారు. అన్ని దుకాణాలకు సంబంధించి రూ. 5.76లక్షల విలువైన మందులకు సరైన ధ్రువపత్రాలు చూపించకపోవడంతో వాటి విక్రయాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అనుమతి పొందిన విత్తనాలనే విక్రయించాలి

గడివేముల: మండల పరిధిలోని ఎరువులు, విత్తనాల దుకాణ దారులు అనుమతి పొందిన వాటినే ఎంఆర్‌పీలకే విక్రయించాలని రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం సహాయ వ్యవసాయ సంచాలకులు కమలాపురం నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ జి. గోపాలు డు సూచించారు. మంగళవారం మండల మండల కేంద్రంలోని జయలక్ష్మి ఏజెన్సీస్, శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్లు, రైతులకు అమ్మిన బిల్లులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: గూడూరు మండలం కె.నాగలాపురంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్‌బాబు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నారాయణప్ప ఆయా దుకాణాల్లో ఎరువుల స్టాక్, సేల్స్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కె.నాగలాపురంలోని శ్రీమౌనిక ట్రేడర్స్, శ్రీసాయి రాఘవ ట్రేడర్స్ ఎరువుల దుకాణాల్లో రికార్డులు సరిగా లేనందున రూ.24,39,000 విలువ చేసే 82టన్నుల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపేశారు. తనిఖీలో గూడూరు ఏఓ దస్తగిరి రెడ్డి ఉన్నారు.

చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలి

ఓర్వకల్లు : గ్రామీణ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడకుండా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని లొద్దిపల్లె గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పలు వీధుల్లో విస్తృతంగా పర్యటించి మురుగు కాల్వలు, చెత్త కుప్పలను, పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. చెత్త సేకరణ ట్రాక్టర్ క్రమం తప్పకుండా వస్తుందా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద) కేంద్రాన్ని సందర్శించారు. అదేవిధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని మంచినీటి ట్యాంక్ వద్దకు వెళ్లి ట్యాంక్ శుభ్రం, క్లోరినేషన్ చేసిన తేదీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈఓ నాసరరెడ్డి

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

గడివేముల: విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని శాంతిరాం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సైకియాట్రీ డాక్టర్ సింధుజ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.